మౌలిక వసతులు కల్పించరూ?

- పశువైద్యశాలలో ఇక్కట్లు
- ఇరుకు గదులతో ఇబ్బందులు
- అపరిశుభ్రంగా పరిసర ప్రాంతం


వసతులు లేని పశువైద్యశాల భవనం

అయిజ: పట్టణంలోని పశువైద్యశాల మౌలిక వసతులు లేమితో కొట్టుమిట్టాడుతోంది. ఇరుకు గదులు, వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఆవరణ ప్రాంతం కూడా అధ్వాన్నంగా ఉండటంతో అవస్థలు పడుతున్నట్లు సిబ్బంది పేర్కొన్నారు. విశాల ఆవరణ ప్రాంతం లేకపోవడంతో పశువులను వైద్యానికి తీసుకొచ్చినపుడు ఇబ్బంది పడాల్సి వస్తోందని పాడి రైతులు కూడా వాపోతున్నారు.

ఇరుకు భవనంలో ఏర్పాటు..

మండల కేంద్రంలోని పశువైద్యశాలను ఇరుకు భవనంలో ఏర్పాటు చేశారు. వెటర్నరీ ఇన్‌చార్జి అసిస్టెంట్ సర్జన్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్, అటెండర్ విధులు నిర్వహిస్తున్నారు. చిన్నగదిలో పశువైద్యాధికారి, మరొక గదిలో ఫర్నిచర్, మందులు, సబ్సిడీ దాణా తదితర వస్తువులు ఉంచారు. భవనం చుట్టుపక్కల ముళ్ల పొదలు ఉండడంతో పాములు, తేళ్లు తరుచూ పశువైద్యశాలలోకి వస్తుండటంతో సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. భవనం ముందు ఖాళీ స్థలం ఎక్కువగా లేకపోవడంతో పశువులకు వైద్య సేవలందించేందుకు ఇబ్బందిగా ఉన్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఎద్దులు 9,320, ఆవులు 2,585, గొర్రెలు, మేకలు 10,755 వరకూ ఉన్నాయి. నిత్యం వైద్య సేవలకు చుట్టుపక్కల గ్రామాల పశువుల యజమానులు వైద్యశాలను సందర్శిస్తుంటారు. వైద్యానికి పశువులు వచ్చినప్పుడు కనీసం వైద్యం అందించడానికి కూడా సరైన స్థలం లేదని వాపోతున్నారు. వైద్యశాల పక్కన ఉన్న పెద్దవాగు అపరిశుభ్రంగా ఉండడంతో దుర్వాసన వెదజల్లుతుందని తెలిపారు. అనువైన ప్రదేశంలో మౌలిక వసతులతో కూడిన నూతన భవనాన్ని నిర్మించాలని వైద్య సిబ్బంది కోరుతున్నారు.


సామగ్రితో నిండిన వైద్యశాల లోపలి భాగం

విశాల ఆవరణలో నిర్మించాలి..



పశువులను చికిత్సను తీసుకొచ్చినపుడు వైద్యశాల ఆవరణలో స్థలం లేక ఇబ్బందులు పడుతున్నాం. దవాఖాన ముందు స్థలం లేకపోవడంతో ఒకదాని తర్వాత మరొక పశువును కాంపౌండ్‌లోకి తీసుకపోవాలి. పశువులను రోడ్డుపైనే ఉంచాల్సి వస్తోంది. విశాలమైన ఆవరణలో పశువుల వైద్యశాల ఏర్పాటు చేయాలి.

\- తిరుమలేష్, అయిజ

ఇరుకైన భవనంలో అవస్థలు..



పశువైద్యశాల భవనం ఇరుకుగా ఉండడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాం. వైద్యశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఉన్నతాధికారులకు తెలియజేశాం. విశాలమైన ప్రదేశంలో నూతన భవనం నిర్మిస్తే వైద్యం చేసేందుకు వీలుగా ఉంటుంది.

\-వెంకట్రాజ్, ఇన్‌చార్జి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్

క్లుప్తంగా

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి



అయిజ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపునకు కృషి చేయాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రదీప్ కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, వీరేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

మహాసభ జయప్రదం చేయాలి

మల్దకల్: హైదరాబాద్‌లోని గ్రీన్‌లాండ్ గార్డెన్‌లో 24న సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాలతో నిర్వహించనున్న మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు చిన్న తిమ్మన్న పేర్కొన్నారు. మహాసభకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



గట్టు: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. గురుకుల పాఠశాలలో 989 మందికి గాను 972 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. కస్తూర్బా పాఠశాలలో 262 మంది విద్యార్థులకు గాను 258 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎస్ఓ గోపిలత పేర్కొన్నారు.

'చర్యలు తీసుకోవాలి'



అమరచింత: శ్రీచైతన్య విద్యా సంస్థల్లో చోటు చేసుకుంటున్న విద్యార్థుల ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరిపించాలని, విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. మండలంలోని నందిమళ్లలో పీడీఎస్‌యూ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మహత్యలు ఆందోళనకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన విద్యార్థి కుటుంబాలకు రూ.50లక్షలు ఇవ్వాలన్నారు. అనుమతులు లేకుండా కొనసాగిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థలను వెంటనే తొలగించాలని కోరారు. రాష్ట్రంలో ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో దీవెన్, సాయికుమార్, శివ, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆలయ రోడ్డుకు మరమ్మతు



ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరువులో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి జాతర సందర్భంగా ఏర్పాట్లు చేపడుతున్నామని ఆలయ చైర్మన్ వెంకటనర్సింహారావు, వైస్‌చైర్మన్ ఏపూరి యాదగిరిశెట్టి, ప్రధానకార్యదర్శి సాయిరాఘవ, కోశాధికారి మణివర్ధన్‌రెడ్డి, సహాయకార్యదర్శి తెలుగు నాగేష్, పూజారి కర్ణసయ్య తెలిపారు. ఆలయానికి వెళ్లేందుకు ఆదివారం మట్టిరోడ్డును బాగుచేయించారు. పరిసరాల్లో పేరుకుపోయిన ముళ్ల పొదలను జేసీబీ ద్వారా తొలగించారు. మార్చి 1, 2, 3 తేదీల్లో రాత్రి 9గంటలకు తేరు మహోత్సవం కనులపండుగగా జరుగనుందన్నారు. వారం రోజుల పాటు జాతరను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని, మార్చి 3న సాంస్కృతిక కార్యక్రమాలు, జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని, మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలతో పాటు పల్లకీసేవ, రథోత్స వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరుతున్నారు.

'ఆలోచన పండుగ' జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న మాచర్ల ప్రకాష్

గట్టు: నడిగడ్డలో అంబేద్కర్ 'ఆలోచన పండుగ'ను ఏప్రిల్ 12న నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలో 10 వేల మందితో అంబేడ్కర్ ఆలోచనా పండుగను నిర్వహించనున్నట్లు ఆదివారం తెలిపారు. అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామగ్రామాన తిరిగి అంబేడ్కర్ ఆశయాలను, ఆలోచన విధానాన్ని ప్రజలకు చేరవేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం అయిజ మండల అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు సురేష్,రాజు, రంజిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన ముఖద్వారం


అలంపూర్ చౌరస్తాలో విద్యుత్ దీపాల అలంకరణలో స్వాగత తోరణం

అలంపూర్: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలు మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. 26న మహాశివరాత్రి సందర్భంగా దక్షిణ కాశీ క్షేత్రంగా పేరగాంచిన అలంపూర్ జోగుళాంబ ఆలయాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అలంపూర్ చౌరస్తాలోని 44వ జాతీయరహదారి ఫ్లైఓవర్ కూడలిలో ఉన్న ముఖ ద్వారం, కర్నూల్–హైదరాబాద్ మార్గంలోని స్వాగత తోరణానికి విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: విశ్వశాంతి విద్యా సంస్థల చైర్మన్ ఆస్పరి రామిరెడ్డి(81) ఆదివారం వయోభారంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు, పీఏసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పరమేశ్వర్ రెడ్డి వారి అలంపూర్ చౌరస్తాలో వారి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. హెచ్ఎంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దారని ఎమ్మెల్యే కొనియాడారు.

శ్రీశైలానికి శివ మాలధారుల పాదయాత్ర


చెన్నిపాడు నుంచి పాదయాత్రగా వెళ్తున్న శివ మాలధారులు

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామంలో ఆదివారం శివ మాలధారులు శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో శివ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

పాదయాత్ర భక్తులకు అన్నదానం

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ శివాలయం వద్ద శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు ఆదివారం అన్నదానం చేపట్టారు బోయలగూడానికి చెందిన శివ భక్తులు. ప్రతి ఏటా ఆరు రోజుల పాటు అన్నదానంతో పాటు మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు 14 ఏళ్లుగా అన్నదానం, మందులు అందజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


ఉత్సవాలకు హాజరైన ప్రజలు

అయిజ: మండల కేంద్రంలోని తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. ఈనెల 20 కొనసాగనున్న సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించేందుకు వివిధ పాఠశాలల విద్యార్థులు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి వీక్షిస్తున్నారు. ఆదివారం వివిధ వేషధారణల్లో చిన్నారుల ఆట, పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న చిన్నారులు

నాణ్యమైన భోజనం అందించాలి



ధరూరు: వసతి గృహంలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. మండల పరిధిలోని ఉప్పేరు ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆదివారం సందర్శించి మాట్లాడారు. విద్యార్థుల హాజరు రిజిష్టర్, మరుగుదొడ్లు, స్నానపు గదులు, కిచెన్, వసతి సముదాయాన్ని పరిశీలించారు. నూతన మెనూ పాటించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో వార్డెన్ సుధీర్ గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతతో ఆధ్యాత్మిక చింతన



కొత్తకోట రూరల్: భగవద్గీత చదివితే జ్ఞానం పెరుగుతుందని త్రైతసిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట కమిటీ అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రి పురస్కరించుకుని ఆదివారం పెద్దమందడి మండలంలోని చిలకటోనిపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శివరాత్రి విశిష్టతను తెలియజేశారు. శివలింగం పైన ఉన్న మూడు విభూతి రేఖలు జీవాత్మ, ఆత్మ, పరమాత్మకు గుర్తు అని, ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడన్నారు. అందుకే మధ్యలో ఉండే విభూతి రేఖకు ఎర్రని బొట్టు పెడతారని, మూడు ఆత్మల వివరణ తెలుసుకోవడం ఆధ్యాత్మికంలో ముఖ్యమైన విషయమని తెలిపారు. శివరాత్రి జాగరణ అంటే మాయపై జాగృతి కలిగి జ్ఞానం పొంది ఇతరులకు కూడా దైవ జ్ఞానం తెలియజేయడమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, తిరుమలేష్, భాస్కర్ రెడ్డి, ముజాఫర్‌ఖాన్, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల, లయ తదితర సభ్యులు ఉన్నారు.

నేడు భవన నిర్మాణ సంఘం మహాసభ

అమరచింత: ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మూడో మహాసభ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు తెలిపారు. జిల్లా ఏర్పడి నేటికీ పదేళ్లు అవుతున్నా రెగ్యులర్ లేబర్ అధికారులు లేకపోవడం శోచనీయం అన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా కార్మికులకు అందాలంటే లేబర్ అధికారులను ప్రభుత్వం వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల కోసం నిర్వహించే మహాసభకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేతాజీ, వివేకానంద స్ఫూర్తితో ఎదగాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

గద్వాలటౌన్: భారతదేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన స్వామి వివేకానంద, భారత స్వాతంత్ర్య సంగ్రామంలో నేతాజీ పాత్ర ఎంతో కీలకమైందని ఇలాంటి వారి స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు బీజాపూర్ కరేంద్రనాథ్ అన్నారు. వివేకానంద, నేతాజీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహనీయులని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగి దేశానికి పూర్వ వైభవాన్ని తెచ్చిపెట్టాలన్నారు. వారి ఆశయాలను మననం చేసుకుంటూ దేశహితం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఏబీవీపీ రాజీలేని పోరాటాలు చేసి పరిష్కరించిందన్నారు. ఏబీవీపీ విద్యార్థి సమస్యలను పరిష్కరించడంతో పాటు జాతీయ పునర్నిర్మాణం కోసం పాటు పడుతుందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ప్రతి విద్యార్థికి దేశభక్తి భావనను తెలియజేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఏబీవీపీ కీలకపాత్ర పోషించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం దేశం, రాష్ట్రంలో ఉన్నత విలువలు కలిగిన ఏకైక విద్యార్థి సంఘం ఏబీవీపీ అని కొనియాడారు. దేశంకోసం సైన్యంలా ఎప్పుడూ పోరాటాలు చేస్తుందన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కళందర్ బాషా, ఏబీవీపీ నాయకులు కావలి ఆంజనేయులు, పద్మశ్రీ, సురేష్, ఆంజనేయులు, నరేష్, జయతి, శిరీష, అనూష, మాధవి తదితరులు పాల్గొన్నారు.

15 శాతం నిధులు కేటాయించాలి


గట్టులో సంతకాలను సేకరిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు

గట్టు: విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 15 శాతం నిధులను కేటాయించాలంటూ బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. సంతకాల సేకరణ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డికి పత్రాలు పంపనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల తక్కువగా కేటాయించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు దెబ్బతిన్నట్లు ఆరోపించారు. అన్ని పాఠశాలలను పూర్వ ప్రాథమిక విద్యకు అనుసంధానం చేయాలన్నారు. పూర్తి స్థాయిలో జిల్లా, మండల విద్యాధికారులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ మండల కోకన్వీనర్ నర్సింహులు, తిమ్మప్ప, రాముడు తదితరులు పాల్గొన్నారు.

గాడ్గే బాబాకు ఘన నివాళి


సోంపురంలో గాడ్గేబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ధరూరు/ అయిజ/ ఎర్రవల్లి: స్వచ్ఛ భారత్ సృష్టికర్త గాడ్గే బాబా జయంతి వేడుకలు ఆదివారం మండల పరిధిలోని సోంపురం గ్రామంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దేవన్న మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కీర్తనలతో మనసుల్ని, మరో వైపు చీపురుతో వీధులను శుభ్రం చేసిన మహనుభావుడు అని కొనియాడారు. జీవితాంతం మూఢ నమ్మకాలపై ప్రజలు చైతన్యం చేసిన యోధుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో అశోక్, లాజర్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

- గాడ్గే బాబా జయంతి కార్యక్రమం బీఎస్పీ నాయకులు అయిజ మండలంలోని పులికల్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు శశి వర్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.
- ఎర్రవల్లి మండల కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో గాడ్గేబాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశంలో బడుగు, బలహీన వర్గాల పిల్లల చదువు కోసం ఆరాటపడిన విద్యావేత్త అని కొనియాడారు. కార్యక్రమంలో మణికుమార్, రామారావు, భీమన్న ఉన్నారు.

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవం


యంత్ర ప్రతిష్ఠలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి


క్రేన్ సాయంతో ఏకశిల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

వనపర్తి టౌన్: 400 ఏళ్ల నాటి పాతబజార్‌లోని సీతారామ సైత వీరాంజనేయ ఆలయం పునఃప్రతిష్ఠ మహోత్సం ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహాస్థాపన, బొడ్రాయి ప్రతిష్ఠ, శయాధివాసంలో ఉన్న దేవతామూర్తులను మూల నక్షత్ర యుక్త మీన లగ్నంలో యంత్ర ప్రతిష్ఠ చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహాలకు జీవకళ ఉట్టిపడేందుకు జీవన్యాసము, నేత్రోన్మీలనం చేపట్టారు. అనంతరం కామధేనుతో దేవతామూర్తులను దర్శించుకోవడంతో మూడు రోజులుగా నడుస్తున్న పూర్ణాహుతి క్రతువును పూర్తి చేశారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం శంకు, చక్రాలు, త్రిశూలం, నాగదేవతామూర్తుల కలిగిన 42 అడుగుల ఎత్తైన ఏకశిల ధ్వజస్తంభం ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా చేపట్టారు. భక్తులు చేసిన శ్రీరామ నామస్మరణ నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అంతకుముందు భక్తులు ఏకశిల ధ్వజస్తంభానికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న ఆలయం ఇన్నాళ్లు రహదారి కిందిభాగంలో ఉండేదని, ప్రస్తుతం ఆలయం పునః ప్రతిష్ఠతో ఆలయానికి శోభ చేకూరిందని భక్తులు, ప్రముఖులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వేద పండితులు జోషి ప్రశాంత్‌శర్మ, ధీరజ్‌శర్మ, నరేందర్‌శర్మ, శాంతికృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

'బండి సంజయ్ వ్యాఖ్యలు సరికాదు'


మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ నాయకులు

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనలో ముస్లిం మైనార్టీలను బీసీలలో చేర్చొద్దని కేంద్రమంత్రి బండి సంజయ్ సూచించడం తగదని ముస్లిం జేఏసీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. 2016లో జస్టిస్ సచార్, జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార్సుల మేరకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. విద్య, ఆర్థిక, ఉద్యోగ, సామాజిక, రాజకీయ రంగాల్లో ముస్లింలు అందరి కంటే పేదరికంలో ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో ముస్లింలను బీసీలో చేరిస్తే పార్లమెంట్‌లో బిల్లును అడ్డుకుంటామని బీజేపీ కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రకటించడం ఎంత వరకు సమంజసం ప్రశ్నించారు. బీజేపీ ముస్లిం వ్యతిరేకంగా ఉందనే విషయం వారి మాటల్లోనే తెలుస్తుందని, ఇలాంటి ఘటనలకు పాల్పడితే శాంతియుతంగా ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. కార్యక్రమంలో తాఫిక్, నబి, పాషా, దస్తగిర్, నిసార్, అబేద్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.